కొండా లక్ష్మణ్ బాపూజీ ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా దేవదాసు



చిక్కడపల్లి: తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఉత్సవ కమిటీ కన్వీనర్‌గా డా. చిక్కా దేవదాసు గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 27న రవీంద్ర భారతిలో జరిగే వేడుకలకు పద్మశాలీయులు అధిక సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు.

ఘనంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ స్వర్ణోత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ గ్రామీణ బ్యాంకు 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలను ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాపరెడ్డి నల్లకుంటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన, కంటి శిబిరాలు నిర్వహించారు. 'స్వచ్ఛతా హి సేవ' కార్యకలాపాలు, బతుకమ్మ ఉత్సవాలు వంటి విభిన్న వేడుకలను ప్రారంభించారు.

వైభవంగా సగర బతుకమ్మ

కవాడిగూడ: తెలంగాణ సగర మహిళా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్ బతుకమ్మ ఘాట్‌లో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబింపజేసే విధంగా సగర కుల మహిళలు వేలాదిగా తరలివచ్చి సాంప్రదాయ పాటలతో... నృత్యాలతో హోరెత్తించారు. తెలంగాణ సగర మహిళ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాలకు ముఖ్యఅతిథులుగా తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ హాజరయ్యారు.

వైద్యుల సేవలు ఎనలేనివి

ముషీరాబాద్: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ వైద్యులు అందిస్తున్న సేవలు ఎనలేనివని బీఆర్ఎస్ సీనియర్‌నాయకులు, హిదాయత్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మహ్మద్ షాహేద్ అన్నారు. గత వారం రోజులుగా ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో స్వస్త్ నారీ, స్వశక్తు పరివార్ అభియాన్ పేరిట ప్రభుత్వ వైద్యాధికారులు వివిధ రకాల వ్యాధులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య శిబిరాలు నిర్వహించినందుకు అభినందిస్తూ ముషీరాబాద్ పఠాన్ బస్తీలోని బహదూరియార్ జంగ్ హాల్‌లో హిదాయత్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, డాక్టర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ షాహేద్ మాట్లాడుతూ కరోనా కాలం నుంచి స్థానికంగా ఉన్న ప్రభుత్వ యూపీహెచ్‌సీల వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య విషయాలు తెలుసుకోవడంతో పాటు వాడవాడల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ అవసరమైన వారికి మందులను ఉచితంగా మందులు అందజేస్తున్నారన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తే తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాఫర్, డాక్టర్ అనిల్, డాక్టర్ జిలానీ, పీహెచ్‌ఎన్ కమలమ్మ, ఏఎన్ఎంలు రజిత, రేణుక, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.







బతుకమ్మకుంట దృశ్యాలు

బతుకమ్మకుంట సిద్ధం.!

- సాయంత్రం 6గంటల నుంచి బతుకమ్మ ఉత్సవాలు షురూ
- కుంట వద్ద పార్కింగ్ ఏర్పాట్లు
- అన్ని జాగ్రత్తలు తీసుకున్న అధికారులు
- కుంటను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన వైనం

నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో పునరుద్ధరించిన బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రి బతుకమ్మ కుంటను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేనున్నారు. పరిసర ప్రాంతాల్లో లైటింగ్, పారిశుద్ధ్యం, వేదికలు, కుంటకు ముస్తాబు చేశారు. గురువారం రోజంతా వివిధ విభాగాల అధికారు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

150 రోజుల్లో పనులు పూర్తి...

బతుకమ్మకుంట పునరుద్ధరించాలంటూ ఏళ్ల తరబడి వస్తున్న డిమాండ్‌ను హైడ్రా 5 నెలల్లో పూర్తి చేసింది. ప్రైవేటు స్థలమని... ప్రభుత్వ స్థలమని ఎన్నో వివాదాల నడుమ సరిగ్గా 5 నెలల క్రితం హైడ్రా రంగ ప్రవేశం చేసింది. కుంటను సమగ్ర సర్వే నిర్వహించి పక్కా ప్రణాళికతో పనులు ప్రారంభించారు. సుమారు రూ.6కోట్ల అంచన వ్యయంతో బతుకమ్మకుంటను సమగ్ర అభివృద్ధిని చేశారు. మట్టి తవ్వగానే నీరు ఉబికి రావడంతో సంచలనంగా మారింది. నీరు రావడంతో సహజ సిద్ధమైన కుంట ఉందనడానికి నిదర్శనంగా మారింది. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణలో భాగంగా దీనిని సవాలు తీసుకున్నారు. అతి తక్కువ సమయంలో అభివృద్ధి పూర్తి కావడంతో బతుకమ్మకుంట రోల్‌మోడల్‌గా మారింది. కుంట అభివృద్ధి తీరును ఢిల్లీ అధికారులు సైతం అధ్యయనం చేసి వెళ్లారు.

భారీ బతుకమ్మ ఉత్సవానికి ఏర్పాట్లు...

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పేరిట ఉన్న బతుకమ్మకుంటను అభివృద్ధి చేసిన తీరు అందరిని ఆశ్చర్యపరిచింది. సీఎం చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం పెద్ద ఎత్తున ఇక్కడ బతుకమ్మ వేడుకలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారు 2వేల మంది ఈ ఉత్సవాల్లో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. మహిళలను ఇక్కడ జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా జీహెచ్‌ఎంసీ అధికారులు కసరత్తు చేశారు. అంబర్‌పేటతో పాటు నగరంలోని వివిధ నియోజకవర్గాల నుంచి మహిళలను ఇక్కడి తరలించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా కార్యచరణ చేశారు.

ఆనందంగా ఉంది



అంబర్‌పేట నియోజకవర్గంలో బతుకమ్మకుంట పునరుద్ధరించడం చారిత్రాత్మకం, మాజీ ఎంపీ వీహెచ్ కృషితో బతుకమ్మకుంట ఆవిష్కృతమైంది. బతుకమ్మ పండుగ వస్తే పూల బతుకమ్మను ఎక్కడ నిమజ్జనం చేయాలో ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు మాకు అందుబాటులో ఒక సుందరమైన చెరువు అందుబాటులోకి రావడంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధిచేయడం గొప్ప విషయం.

– శంభుల ఉషాశ్రీకాంత్‌గౌడ్
బురుజు గల్లి అంబర్‌పేట

ఆహ్లాదంగా బతుకమ్మకుంట



తాము గత కొన్నేళ్ల నుంచి బతుకమ్మకుంట పక్కనే నివసిస్తున్నాము. అభివృద్ధి చేయకముందు పిచ్చి మొక్కలు, పాములు ఆధ్వన్నంగా ఉండేంది. గత 4 నెలలుగా ఇక్కడ కుంటను అభివృద్ధి చేస్తూంటే ఏలా ఉంటుందో అనుకున్నాము. ఇప్పుడు ఊహించని విధంగా బతుకమ్మకుంట సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారు లేవగానే ముచ్చటేసే చెరువు కనిపిస్తుంది మాకు.

– కోట్ల సాయి అపూర్వ

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



అంగన్‌వాడీ టీచర్ల రాస్తారోకోలో మాట్లాడుతున్న పాలడగు భాస్కర్

కవాడిగూడ: అంగన్‌వాడీ, టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడగు భాస్కర్, అంగన్‌వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన చలో సెక్రటరియేట్ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇందిరాపార్కు చౌరస్తాలో పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొని కొంతసేపు రాస్తారోకో జరిగింది. వారు అంగన్‌వాడీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రీప్రైమరీ, పీఎం శ్రీవిద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే నిర్వహించాలన్నారు. టీచర్లకు రూ.18,000 వేతనం, పీఎఫ్ సౌకర్యం, రిటైర్‌మెంట్ వయసు పెంపు, ఖాళీ పోస్టుల భర్తీ, సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని ధర్నా చౌక్‌లో గురువారం నిరసన వ్యకం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌తో పాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడానికే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు.

ప్రజాప్రయోజనాల కోసమే జీఎస్టీలో సంస్కరణలు



ముషీరాబాద్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: ప్రజా ప్రయోజనాల కోసం జీఎస్టీలో సంస్కరణలు తీసుకువచ్చి దేశంలని 90 శాతం పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ మేలు చేశారని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. గురువారం ముషీరాబాద్‌లో సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... జీఎస్టీ తగ్గించడం వల్ల నిత్యవసరాల ధరలు తగ్గడం వల్ల రోజువారీగా కొనుగోలు చేసే వారికి, పేద ప్రజలకు పన్నుల భారం తగ్గిందని పేర్కొన్నారు. పది సంవత్సరాలలో దేశ ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగు పరిచారని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి పెరగడంతో పాటు కొత్తగా ఉద్యోగాలు వస్తాయన్నారు.

◆ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి తెలంగాణ సంపదను కేటీఆర్, వారి కుటుంబం దోచుకుందని విమర్శించారు. అందువల్లే వారిని ఇంటికే పరిమితం చేశారన్నారు. అయినప్పటికి బీఆర్ఎస్‌కు బుద్ధిరావడం లేదని ప్రధాని నరేంద్రమోదీపై జీఎస్టీ విష''ంలో అవాక్కులు, చెవాక్కులు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బీజేపీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గుర్తించడం వల్లే ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగానా మెజార్టీతో ఘన విజయం సాధిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కంచి ముదిరాజ్, కన్వీనర్ రమేష్‌రాం, పార్టీ సీనియర్ నాయకులు బిజ్జి రవి, అనిల్‌కుమార్, అజయ్‌గుప్తా, మెట్టు వాసు, బాలకృష్ణ, నర్సింగ్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్లో బంగారు ఆభరణాల బ్యాగు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురైంది. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ లోని మహేంద్ర హీల్స్ ప్రాంతానికి చెందిన బండారు అంకిత (41) అకోలా నుంచి కాచిగూడకు రావడానికి బికనూర్ – కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తోంది. కామారెడ్డి వచ్చిన తర్వాత చూసుకునే సరికి తన బ్యాగు కనిపించలేదు. బ్యాగులో 45 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.25వేల నగదు, డెబిట్ కార్డు, ఆధార్ కార్డు ఉన్నవి. గురువారం అంకిత కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

పురస్కారాల ప్రదానోత్సవం

చిక్కడపల్లి: సమీకృత (అంతర్జాతీయ) తెలుగు సాంస్కృతిక – సారస్వత సంఘం (ఇట్ల) ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో అక్కినేని– ఇట్లా విశ్వ తెలుగు వెలుగు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. దీనికి సినీ దర్శకుడు రేలంగి నరసంహారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ గాయకుడు వినోద్‌బాబు, మిమిక్రీ శ్రీనివాస్‌కు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఇట్ల పూర్వ అధ్యక్షుడు సి.రామకృష్ణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నిర్వహణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ధర్మరావు, ప్రముఖులు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, మద్దాళి రఘురాం, యుగంధర్, భుజంగరావు, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.



గాయకుడు వినోద్‌బాబు, మిమిక్రీ శ్రీనివాస్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న రేలంగి

ఇతర జిల్లాల ఆటోలకు అనుమతులు ఇవ్వొద్దు



ఆటో డ్రైవర్ల ధర్నాలో మాట్లాడుతున్న మీర్ ఇనాయత్ అలీ బాక్రీ

కవాడిగూడ: జీహెచ్‌ఎంసీ పరిధిలో తెలంగాణ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన ఆటోలకు అనుమతులు ఇవ్వొద్దని ఇన్‌ఫార్మల్ లేబరీస్ వర్కర్స్ ఫెడరేషన్ (బీఎల్‌డబ్ల్యూఎఫ్) చైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గురువారం ఇందిపార్కు వద్ద డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లకు ఇచ్చిన రూ.12వేల జీవన భృతిని వెంటనే అమలు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లపై ఆర్టీవో, ట్రాఫిక్ పోలీసులు వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. నగరంలో ర్యాపిడో, ఓలా, ఊబర్ వంటి సంస్థలు అక్రమంగా నడుస్తున్న వాహనాలను అరికట్టాలని కోరారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ధర్నాలో ఫెడరేషన్ అధ్యక్షుడు అక్రమ్ ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ మాజిద్, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలు పాటకు బ్రహ్మరథం

చిక్కడపల్లి: సాంస్కృతిక వేదిక రామ్‌కుమార్ కళారవిందం ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి గురువారం గానసభలో జరిగింది. ఈ సందర్భంగా 'బాలు పాటకు బ్రహ్మరథం'శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు బాలు పాటలను మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో వంశీ–ఎస్పీ బాలు మ్యూజిక్ అవార్డును భార్గవి నాగరాజుకు వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు సీహెచ్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



భార్గవి నాగరాజులను సన్మానిస్తున్న వంశీ రామరాజు, సీహెచ్ త్రినాథరావు

ప్రజావసరలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



రాజయ్య గల్లీలో పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. గురువారం అంబర్‌పేట డివిజన్ రాజయ్య గల్లీలో రూ.5.50లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దశలవారీగా పైపులైన్ వ్యవస్థను ఆధుకరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం స్థానికంగా పాదయాత్ర చేసి స్థానిక ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి పండిట్ దీన్ దయాళ్



బర్కత్‌పురలో..

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... ఒక పాత్రికేయుడిగా అప్పటి ప్రభుత్వ ద్వంద్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యాసాలు రాసి ప్రజల మన్ననలను పొందిన వ్యక్తి దీన్ దయాళ్ అని అన్నారు. ఆయన ఆలోచనలు, సేవా తత్త్వం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయన చూపిన మార్గం యువతలో స్ఫూర్తిని నింపుతుందన్నారు. ఈ సందర్భంగా నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేశారు. అదే విధంగా దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకొని సేవా పఖ్వాడా, అంత్యోదయ దివస్‌ను నిర్వహించుకుని కాలనీలు, బస్తీలలో మొక్కలు నాటారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



దుప్పట్లను పంపిణీ చేస్తున్న ఎంపీ డా. కె.లక్ష్మణ్, కార్పొరేటర్ కె.రవిచారి



వీవీగిరి నగర్ కమ్యూనిటీహాల్‌లో..



రోడ్లను ఊడుస్తున్న ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్



ఎంసీహెచ్ కాలనీలో.. సుప్రియానవీన్‌గౌడ్



వేడుకల్లో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండగా ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో కనుల పండువగా జరుగుతున్నాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. జాహ్నవి ఉమెన్స్ డీగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నారాయణగూడలోని జాగృతి డిగ్రీ కళాశాల, బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ కళాశాల, రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి మహిళా కళాశాల, తదితర కళాశాల్లో విద్యార్థినీలు, ఉపాధ్యాయినీలు, సిబ్బంది, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

– ముషీరాబాద్ అంబర్‌పేట జోన్ బృందం



జై మాతా ది.!

అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం (నాల్గో రోజు) అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం







